బీసీసీఐ అధ్యక్షుడిగా రాజీవ్ శుక్లా!

- జూలై 19 తర్వాత వైదొలగనున్న రోజర్ బిన్నీ

ఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి త్వరలోనే కొత్త అధ్యక్షుడు రాబోతున్నాడు. ప్రస్తుతం బోర్డులో ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న రాజ్యసభ ఎంపీ రాజీవ్ శుక్లా.. త్వరలోనే బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ వయసు రీత్యా వచ్చే నెలలో ఆయన ఆ బాధ్యతల నుంచి తప్పుకోనున్నారు. జూలై 19 నాటికి బిన్నీకి 70 ఏండ్లు నిండుతాయి. బీసీసీఐ నిబంధనల ప్రకారం 70 ఏండ్లు నిండిన ఏ వ్యక్తి కూడా బోర్డులో ఏ రకమైన బాధ్యతలూ నిర్వర్తించేందుకు అర్హులు కాదు. దీని ప్రకారమే బిన్నీ స్థానంలో 65 ఏండ్ల శుక్లా ఆ బాధ్యతలు చేపట్టనున్నారని బోర్డు వర్గాలు తెలిపాయి.

కొరియాలో జరిగిన ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన యువ అథ్లెట్ నందినిని సోమవారం హైదరాబాద్‌లో అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కోహ్లీ పబ్‌పై కేసు నమోదు

బెంగళూరు: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీకి చెందిన 'వన్ 8 కమ్యూన్' పబ్ మరోమారు చిక్కుల్లో పడింది. గతంలో ఫైర్‌సేఫ్టీ నిబంధనలు అతిక్రమించడంతో పాటు అర్ధరాత్రి సమయంలో పెద్దపెద్ద శబ్దాలతో పబ్ నిర్వహించిన కోహ్లీ పబ్ తాజాగా మరో వివాదానికి కారణమైంది. పబ్‌లో నిర్దేశిత స్మోకింగ్ ఏరియా లేని కారణంగా బెంగళూరు పోలీసులు సెక్షన్స్ 4, 21 కింద కేసు నమోదు చేశారు.

18 ఏండ్ల కల కోసం..

టైటిల్ పోరుకు బెంగళూరు, పంజాబ్ సిద్ధం

ఆఖరి పోరాటం

నేడే ఐపీఎల్-18 ఫైనల్

ఎవరు గెలిచినా కొత్త చరిత్రే

రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

మహాభారతంలో పాండవుల వనవాసం 12 ఏండ్లు. రామాయణంలో రాముడి అరణ్యవాసం 14 ఏండ్లు.. కానీ ఆధునిక భారతంలో అదీ క్రికెట్‌ను ఓ మతంగా పరిగణిస్తూ క్రికెటర్లను దైవ సమానులుగా కొలిచే ఆటలో రెండు జట్ల వీరాభిమానులు తమ అభిమాన ఫ్రాంచైజీ ఐపీఎల్ టైటిల్‌ను ముద్దాడాలని 18 ఏండ్లుగా కండ్లు కాయలు కాసేలా నిరీక్షిస్తున్నారు. ఆ కరువును తీర్చడానికా అన్నట్టుగా ఎన్నో సవాళ్లను అధిగమించి ఫైనల్ చేరిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్) నేడు తమ ప్రయాణంలో తుది మెట్టుపై నిలిచాయి. మంగళ వారం అహ్మదాబాద్ వేదికగా జరుగబోయే ఫైనల్‌లో ఈ రెండు జట్లూ అమీతుమీ తేల్చుకోనున్నాయి. వీరిలో ఎవరు గెలిచినా ఐపీఎల్‌లో కొత్త చాంపియన్ అవతరించనట్టే!

అహ్మదాబాద్: రెండు నెలలుగా క్రికెట్ ప్రేమికులకు షడ్రుచోపేతమైన విందును అందిస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌కు శుభం కార్డు పడేందుకు ముహూర్తం ఆసన్నమైంది. ఈ లీగ్ ఆవిర్భావం (2008) నుంచీ బరిలో నిలిచి టైటిల్‌ను ముద్దాడే క్షణం కోసం 18 ఏండ్లుగా వేచిచూస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ తమ కలను నెరవేర్చుకునే ప్రయాణంలో ఆఖరి దశకు చేరుకున్నాయి. సీజన్ ఆసాంతం స్ఫూర్తిదాయక విజయాలతో ఫైనల్ చేరిన ఈ ఇరుజట్ల మధ్య మంగళవారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఐపీఎల్-18 ఫైనల్ జరుగబోతున్నది. ఐపీఎల్‌లో ఇప్పటి వరకూ టైటిల్ నెగ్గని ఈ రెండు జట్లలో ఎవరు గెలిచినా కొత్త చరిత్రే కాబోతున్నది.

బలాబలాలు:

జట్టు పరంగా బెంగళూరు గానీ, పంజాబ్ గానీ సమఉజ్జీలే. ఈ సీజన్‌కు ముందే కొత్త సారథులను నియమించుకుని తిరుగులేని ఆటతో ముంబై, చెన్నై, కోల్‌కతా వంటి పటిష్ట జట్లకు చుక్కలు చూపించి ప్రత్యర్థులకు చెమటలు పట్టించిన ఈ రెండు జట్లు.. ఈ సీజన్‌లో తలపడనుండటం ఇది నాలుగోసారి. లీగ్ దశలో విజయం తలా ఒకసారి పలుకరించగా గత నెల 29న ముల్లాన్‌పూర్‌లో జరిగిన తొలి క్వాలిఫయర్‌లో మాత్రం బెంగళూరుదే పైచేయి అయింది. అయితే బలమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన పంజాబ్.. రెండో క్వాలిఫయర్‌లో ఐదు సార్లు చాంపియన్ ముంబైని ఇంటికి పంపించి ఆర్సీబీతో బదులు తీర్చుకునేందుకు సిద్ధమైంది. బెంగళూరుకు బ్యాటింగ్‌లో కోహ్లీ, సాల్ట్, కెప్టెన్ పటీదార్, జితేశ్ శర్మ, టిమ్ డేవిడ్, లివింగ్‌స్టొన్ వంటి దుర్భేద్యమైన లైనప్ ఉంది. ఈ సీజన్‌లో కోహ్లీ 14 ఇన్నింగ్స్‌లో 55.82 సగటుతో 614 పరుగులు చేశాడు. సాల్ట్, పటీదార్, జితేశ్ కూడా టచ్‌లోనే ఉన్నారు. బెంగళూరు బౌలింగ్‌కు హాజిల్‌వుడ్ వెన్నెముక కాగా వెటరన్ భువనేశ్వర్, లెఫ్టార్మ్ పేసర్ యశ్ దయాల్ వంటి సీమర్లు, కృనాల్, సుయాశ్ వంటి స్పిన్నర్లు ఆ జట్టు సొంతం. హాజిల్‌వుడ్ 11 మ్యాచ్‌లలో 21 వికెట్లతో ఆర్సీబీ విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. ముల్లాన్‌పూర్‌లో పంజాబ్ ఓటమిని శాసించిన సుయాశ్.. మరోసారి సత్తాచాటాలని ఆర్సీబీ ఆశిస్తున్నది. బ్యాటింగ్, బౌలింగ్ విషయంలో పంజాబ్ కూడా తక్కువ తిన్లేదు. అన్‌క్యాప్డ్ అరవీర భయంకరులు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్‌తో పాటు కెప్టెన్ శ్రేయాస్, స్టోయినిస్, శశాంక్ సింగ్, నెహల్ వధేరతో ఆ జట్టూ పటిష్టంగానే ఉంది. 18వ సీజన్‌లో శ్రేయాస్.. 16 మ్యాచ్‌లలో 603 రన్స్ చేయగా ప్రభ్‌సిమ్రన్ (523), ప్రియాన్ష్ (451) ఆ జట్టుకు అదిరిపోయే ఆరంభాలిస్తున్నారు. కింగ్స్ బౌలింగ్ దళాన్ని అర్ష్‌దీప్ (18 వికెట్లు) నడిపిస్తుండగా జెమీసన్, స్టోయినిస్, విజయ్‌కుమార్ వంటి పేసర్లు, చాహల్, హర్‌ప్రీత్ బ్రర్ వంటి స్పిన్నర్లు మ్యాచ్‌ను ఏ నిమిషంలో అయినా మలుపు తిప్పగల సమర్థులు. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య ఫైనల్ రసవత్తరంగా జరుగనుండటం ఖాయం

పిచ్: అహ్మదాబాద్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. టాస్ గెలిచిన జట్టు బౌలింగ్‌కు మొగ్గు చూపే అవకాశముంది. గత కొద్ది రోజులుగా ఇక్కడ కురుస్తున్న వర్షాలు ఛేదన చేసే జట్టుకు అనుకూలంగా మారుతున్నాయి. వర్షం వల్ల మ్యాచ్ సాగకుంటే ఫైనల్‌కు రిజర్వ్ డే ఉంది.

1 ఐపీఎల్‌లో మూడు ఫ్రాంచైజీలకు సారథిగా ఉండి మూడింటినీ ఫైనల్ చేర్చిన తొలి, ఏకైక కెప్టెన్ శ్రేయాస్. అతడు 2020లో ఢిల్లీని, 2024లో కోల్‌కతాను 2025లో పంజాబ్‌ను ఫైనల్‌కు చేర్చాడు.

2 పంజాబ్‌కు ఇది రెండో ఫైనల్. 2014లో ఆ జట్టు తొలిసారి టైటిల్ పోరుకు అర్హత సాధించినా ఆ సీజన్‌లో కోల్‌కతా చేతిలో ఓడింది.

కార్ల్‌సన్‌కు గుకేశ్ షాక్

స్టావెంజర్: నార్వే చెస్ స్టార్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ దిమ్మతిరిగే షాక్ ఇచ్చాడు. నార్వే చెస్ టోర్నీలో భాగంగా సోమవారం జరిగిన రౌండ్-6 పోరులో గుకేశ్..కార్ల్‌సన్‌ను మట్టికరిపించాడు. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన పోరులో కార్ల్‌సన్ చేసిన తప్పిదాన్ని తనకు అనుకూలంగా మలుచుకున్న ప్రపంచ చాంపియన్ గుకేశ్ చిరస్మరణీయ విజయం సాధించాడు. గుకేశ్‌కు గేమ్ చేజార్చుకున్న ఒత్తిడిలో బల్లపై బలంగా గుద్ది కార్ల్‌సన్ తన కోపాన్ని ప్రదర్శించగా, గుకేశ్ విజయాన్ని ఆస్వాదిస్తూ కనిపించాడు. మరోవైపు అర్జున్..వీ యి(చైనా)పై, వైశాలి..హంపిపై గెలిచి ముందంజ వేశారు.

హిట్టర్లు ముగించారు

వన్డేలకు గుడ్‌బై చెప్పిన మ్యాక్స్‌వెల్

అంతర్జాతీయ క్రికెట్‌కు హెన్రిచ్ క్లాసెన్ రిటైర్మెంట్

మెల్‌బోర్న్: ఇటీవలి కాలంలో తరుచూ గాయాల పాలవుతున్న గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఇకపై వన్డేలలో కొనసాగబోనని ఆ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. వచ్చే ఏడాది భారత్, శ్రీలంకలో జరుగబోయే టీ20 వరల్డ్ కప్‌పై దృష్టిసారించిన మ్యాక్సీ.. వన్డేల నుంచి తప్పుకున్నాడు. సోమవారం అతడు ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. 'ప్రస్తుత పరిస్థితుల్లో 2027 వన్డే ప్రపంచ కప్ ఆడతానని నేను అనుకోవట్లేదు. ఈ విషయాన్ని సెలెక్టర్లకు వివరించా. నా స్థానంలో ఇతరులకు అవకాశమిచ్చేందుకు ఇదే సరైన సందర్భమని వాళ్లకు చెప్పా. రాబోయే వరల్డ్‌కప్‌లో జట్టు కూర్పు ఎంత ముఖ్యమో నాకు తెలుసు. నాలో ఆట మిగిలున్నంత వరకూ ఆడతానని గతంలో చెప్పా. కానీ నా స్వార్థం కోసం కొన్ని సిరీస్‌లు ఆడి ఊరుకోలేను' అని చెప్పాడు. 36 ఏండ్ల మ్యాక్సీ.. 149 వన్డేలలో 33.81 సగటుతో 3,990 పరుగులు చేశాడు. 2023 వన్డే ప్రపంచకప్‌లో అఫ్గానిస్థాన్‌తో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 91/7 స్కోరు వద్ద ఉండగా అతడు ఆడిన ఇన్నింగ్స్‌ను క్రికెట్ ప్రపంచం ఇప్పట్లో మరిచిపోలేదు. ఆ మ్యాచ్‌లో మ్యాక్సీ.. కాళ్లకు తిమ్మిర్లు వచ్చినా 201 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవడమే గాక జట్టును విజయతీరాలకు చేర్చాడు.

నా జీవితంలో బాధాకరమైన రోజు: క్లాసెన్

కేప్‌టౌన్: 33 ఏండ్ల క్లాసెన్ దక్షిణాఫ్రికా తరఫున 4 టెస్టులు, 60 వన్డేలు, 58 టీ20లు ఆడి 2,764 పరుగులు చేశాడు. మార్చిలో ముగిసిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన సెమీస్ మ్యాచ్ క్లాసెన్‌కు చివరిది. మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చి వీరబాదుడు బాదే క్లాసెన్.. 2023 వన్డే వరల్డ్ కప్, 2024 టీ20 ప్రపంచకప్‌లో ఆ జట్టు విజయాల్లో ముఖ్య భూమిక పోషించాడు. క్లాసెన్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడిస్తూ.. ఇది తన జీవితంలో అత్యంత బాధాకరమైన రోజు అని భావోద్వేగానికి గురయ్యాడు.

కోల్‌కతా శుభారంభం

అహ్మదాబాద్: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ)లో తొలిసారి ఆడుతున్న కోల్‌కతా థండర్ బ్లేడ్స్ మొదటి పోరులోనే అదరగొట్టింది. సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో కోల్‌కతా..8-7తో స్టాన్లీ చెన్నై లయన్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో అంకుర్ 3-0తో కిరిల్‌ను ఓడించి కోల్‌కతాకు ఆధిక్యాన్ని అందించినా చెన్నై ప్యాడ్లర్ సికి.. 3-0తో సెలెనాను ఓడించింది.

సెప్టెంబర్ 30 నుంచి మహిళల వన్డే ప్రపంచకప్

- టైటిల్ ఫేవరెట్‌గా బరిలో భారత్

దుబాయ్: భారత్ వేదికగా మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీ షెడ్యూల్ సోమవారం ఖరారైంది. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు మెగాటోర్నీ జరుగనున్నట్టు ఐసీసీ అధికారిక ప్రకటనలో పేర్కొంది. వాస్తవానికి భారత్ వేదికగా ప్రపంచకప్‌లో మొత్తం మ్యాచ్‌లు జరుగాల్సి ఉన్నా..పాకిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కొలంబోలో పాక్ మ్యాచ్‌లకు ఏర్పాట్లు చేశారు. బెంగళూరు, గువాహటి, ఇండోర్, విశాఖపట్నం, కొలంబో వేదికలుగా వరల్డ్‌కప్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. సెప్టెంబర్ 30న బెంగళూరులో భారత్, బంగ్లా పోరుతో ప్రపంచకప్ టోర్నీకి తెరలేవనుంది. తొలి సెమీస్ గువాహటి లేదా కొలంబోలో అక్టోబర్ 29న జరుగనుండగా, రెండో సెమీస్‌కు అక్టోబర్ 30న బెంగళూరు ఆతిథ్యమివ్వనుంది. 12 ఏండ్ల తర్వాత ఆతిథ్యమిస్తున్న భారత్ టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నది.

మెగా టోర్నీకి చికున్ గున్యా అడ్డంకి

దుబాయ్: ఈనెల 6 నుంచి శ్రీలంకలో జరగాల్సి ఉన్న ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ఉమెన్స్ ఎమర్జింగ్ ఆసియా కప్ వాయిదా పడింది. ఈ టోర్నీకి శ్రీలంక ఆతిథ్యమివ్వాల్సి ఉండగా.. ప్రస్తుతం అక్కడ వాతావరణ పరిస్థితులతో పాటు స్థానికంగా చికున్ గున్యా పంజా విసురుతున్నది. ఆటగాళ్ల భద్రత నేపథ్యంలో ఈ టోర్నీని వాయిదా వేయాలని లంక కోరగా అందుకు ఏసీసీ అంగీకరించింది.

వాణిజ్య

తయారీ రంగం డీలా

3 నెలల కనిష్ఠానికి వృద్ధిరేటు పతనం • మే నెలలో 57.6 స్థాయికి పరిమితం

న్యూఢిల్లీ, జూన్ 2: దేశంలో కీలకమైన తయారీ రంగం డీలాపడింది. భారత ప్రగతికి అన్నివిధాల దన్నుగా ఉండే ఉత్పాదక రంగం నానాటికీ బలహీనపడుతుండటం ఇప్పుడు అత్యంత ఆందోళనకరంగా మారుతున్నది. గత నెల 3 నెలల కనిష్ఠాన్ని తాకింది. సోమవారం విడుదలైన హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) మే నెలలో 57.6 స్థాయికి పరిమితమైంది మరి. అంతకుముందు నెల ఏప్రిల్‌లో ఇది 58.2గా ఉన్నది. ఈ ఏడాది ఫిబ్రవరి తర్వాత సూచీ ఇంతలా పడిపోవడం ఇదే తొలిసారి.

ఇదీ సంగతి..

ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మార్కెట్‌లో తగ్గిన డిమాండ్, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు.. పీఎంఐ వృద్ధిరేటును అడ్డుకున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా భారత్-పాకిస్థాన్ సంఘర్షణ, మార్కెట్‌లో పెరిగిన పోటీ వాతావరణం, విజృంభిస్తున్న ధరలు.. తయారీ రంగ కార్యకలాపాలకు ప్రధాన అవరోధంగా పరిణమించాయని హెచ్‌ఎస్‌బీసీ ఇండియా చీఫ్ ఎకనామిస్ట్ ప్రంజుల్ భంగారీ చెప్తున్నారు. ఇక రవాణా, కార్మిక-కూలీల ఖర్చులు పెరిగిపోయాయని, దీంతో నిర్వహణ వ్యయాలు భారమైపోయాయని తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ఖర్చులతో ఆయా ఉత్పత్తి ధరలూ పెరుగుతున్నాయని, దీంతో మార్కెట్‌లో డిమాండ్ అంతంతమాత్రంగానే ఉంటుందని, ఇది మళ్లీ ఉత్పత్తినే దెబ్బతీస్తున్నదని అంటున్నారు.

వాహన అమ్మకాలు డౌన్

మారుతి, హ్యుందాయ్ తదితర ఆటో సంస్థలు నిరాశాజనకం



న్యూఢిల్లీ, జూన్ 2: గత కొన్ని నెలలుగా టాప్‌గేర్‌లో దూసుకుపోయిన వాహన సంస్థలకు గత నెలలో గట్టి షాక్ తగిలింది. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలైన మారుతి సుజుకీ, హ్యుందాయ్ మోటర్ ఇండియాకు చెందిన ప్యాసింజర్ వాహన అమ్మకాలు భారీగా పడిపోయాయి. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడం వల్లనే కార్లను కొనుగోలు నిలిచిపోయాయి. ముఖ్యంగా ఎంట్రీ-లెవల్ కార్ల సేల్స్ భారీగా పడిపోయాయి. గత నెలలో దేశీయంగా 1,35,962 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలను విక్రయించింది మారుతి సుజుకీ. క్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 1,44,002 యూనిట్లతో పోలిస్తే ఆరు శాతం తగ్గాయని పేర్కొంది. ఎంట్రీ-లెవల్ విభాగానికి చెందిన కార్లకు డిమాండ్ పడిపోవడం వల్లనే మొత్తం విక్రయాలపై ప్రతికూల ప్రభావం చూపిందని మారుతి సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ తెలిపారు. దాయాదుల మధ్య ఉద్రిక్తత పరిస్థితులతో జమ్ము అండ్ కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ర్టాల్లో అమ్మకాలు 55 శాతం పడిపోయాయన్నారు. అలాగే హ్యుందాయ్ దేశీయ అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 11 శాతం తగ్గి 43,861 యూనిట్లకు పరిమితమయ్యాయి.

80 ఎకరాల్లో ఎకో-టౌన్: దుద్దిళ్ల

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): భావితరాల అవసరాలకు అనుగుణంగా సుస్థిరాభివృద్దే లక్ష్యంగా జపాన్‌లోని కిటాక్యూషు నగర స్ఫూర్తితో రాష్ట్రంలో 80 ఎకరాల్లో ఎకో టౌన్‌ను అభివృద్ధి చేయనున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. తెలంగాణ, కిటాక్యూషు మధ్య కుదిరిన పరస్పర సహకార ఒప్పందం ఇందుకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) సంయుక్తాధ్వర్యంలో టీహబ్ లో 'ఫ్రం కిటాక్యూషు టూ తెలంగాణ-కేటలైసింగ్ సస్టెనైబుల్ ఇండస్ట్రియల్ గ్రోథ్' అనే అంశం నిర్వహించిన సదస్సులో ఆయర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంతో అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా మార్చాలన్నదే తమ ప్రజా ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రాష్ట్రంలో జపాన్ కంపెనీలు మరిన్ని పెట్టుబడులు పెట్టేలా ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇప్పటికే తెలంగాణకు చెందిన 50 మంది యువతకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు లభించాయని, మరింత మందికి దక్కేలా టామ్‌కామ్ వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా జపనీస్ భాషను నేర్పిస్తామన్నారు.

తులం రూ. 1,50,000!

ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో బంగారం ధర లక్ష రూపాయలకు దగ్గర్లో కదలాడుతున్నది.

ఆ మధ్య తులం విలువ మునుపెన్నడూ లేనివిధంగా తొలిసారి లక్ష రూపాయల మార్కును దాటినా తిరిగి కిందకు దిగొచ్చింది.

అయితే ఈ ఏడాది ఆఖరుకల్లా 24 క్యారెట్ 10 గ్రాముల రేటు రూ.1,50,000కు చేరుకోవచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయిప్పుడు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 4,500 డాలర్లు పలికితే ఇది సాధ్యమేనంటున్నారు మరి.



ఈ ఏడాది ఆఖరుకల్లా బంగారం ధర చేరుకోవచ్చన్న అంచనా

అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్

4,500 డాలర్లను తాకవచ్చంటున్న గోల్డ్‌మన్ సాచ్స్

న్యూఢిల్లీ, జూన్ 2: త్వరలో బంగారం ధరలు సరికొత్త రికార్డులను నెలకొల్పబోతున్నాయా? ఇప్పట్లో ఎవరూ ఊహించని స్థాయిని తాకబోతున్నాయా?.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయిప్పుడు. ఇప్పటికే దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల రేటు లక్ష రూపాయల మార్కును దాటేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్‌లో తులం మునుపెన్నడూ లేనివిధంగా రూ.1,01,600 పలికింది. అయితే దేశ, విదేశీ పరిస్థితుల నడుమ ధరలు కొంతమేర తగ్గినా.. ఇంకా లక్ష రూపాయల సమీపంలోనే కదలాడుతున్నాయి. కానీ ఈ ఏడాది ఆఖరుకల్లా ధరలు భారీ ఎత్తున ఎగబాకవచ్చన్న అభిప్రాయాలు మార్కెట్ నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

లక్షన్నరకు..

అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఔన్స్ గోల్డ్ రేటు గరిష్ఠంగా 4,500 డాలర్లకు చేరవచ్చని ప్రముఖ బహుళజాతి బ్యాంకింగ్ సంస్థ, ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్స్ సాచ్స్ చెప్తున్నది. మరో సంస్థ యూబీఎస్ కూడా ఇదే అభిప్రాయాన్ని కనబరుస్తుండటం గమనార్హం. దీంతో ఈ అంచనాలే నిజమైతే భారతీయ మార్కెట్‌లో బంగారం ధరలు భగ్గుమనడం ఖాయమే. ఈ క్రమంలోనే 24 క్యారె ట్ తులం విలువ రూ.1,50,000గా ఉంటుందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఈక్విటీల్లో..

దేశ, విదేశీ స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులు పెరిగితే.. మదుపరులు తమ పెట్టుబడులను సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారం వైపునకే మళ్లిస్తారు. కాబట్టి ఈక్విటీ సూచీల తీరుతెన్నులు కూడా గోల్డ్ రేట్లను నిర్దేశించనున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలు, రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాల ప్రభావం సైతం ఇన్వెస్టర్ల మైండ్‌సెట్‌ను మార్చగలవన్నని చెప్పకతప్పదు. ఇప్పటికే భారత్‌సహా ఆసియాలోని కీలక దేశాల స్టాక్ మార్కెట్లలో నిలకడ లోపించింది. అమెరికా, ఐరోపా మార్కెట్లదీ ఇదే పరిస్థితి. దీంతో బంగారంపై పెట్టుబడులు కొనసాగుతున్నాయి. ఇవి మరింతగా పెరిగితే ధరలు పరుగులు పెడుతాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇక దేశీయ మార్కెట్ విషయానికొస్తే.. పండుగలు, పెండ్లిళ్ల సీజన్ ప్రభావం అదనంగా పుత్తడి ధరలపై కనిపిస్తూ ఉంటుంది. మొత్తానికి ఈ ఏడాది ఆఖర్లో తులం పసిడి లక్షన్నర రూపాయల మార్కును అందుకుంటుందన్న అంచనాలైతే ఉన్నాయి.

రూ.98,930 వద్దకు..

దేశ రాజధాని ఢిల్లీ మార్కెట్‌లో సోమవారం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.330 పెరిగి రూ.98,930 పలికింది. హైదరాబాద్‌లో కూడా ఇదే స్థాయిలో ధరల పెరుగుదల ఉన్నప్పటికీ.. తులం రూ.97,640గానే ఉన్నది. ఇక 22 క్యారెట్ 10 గ్రాములు క్రిందటి రోజు ముగింపుతో పోల్చితే రూ.300 పుంజుకొని రూ.89,500గా ఉన్నది. కాగా, ఢిల్లీలో కిలో వెండి ధర రూ.100 పెరిగి లక్ష రూపాయల మార్కుకు ఎగువన రూ.1,00,100గా నమోదైంది. అమెరికాలోకి దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియంపై సుంకాలను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని ట్రంప్ యోచిస్తుండటంతో మళ్లీ రేట్లు పెరుగుతూపోతున్నాయని అఖిల భారత సరఫా అసోసియేషన్ విశ్లేషిస్తున్నది. ఇదిలా వుంటే అంతర్జాతీయంగా ఔన్స్ గోల్డ్ స్పాట్ మార్కెట్‌లో 59.21 డాలర్లు ఎగిసి 3,348.61 డాలర్లకు చేరింది.

రికార్డుస్థాయికి యూపీఐ లావాదేవీలు

న్యూఢిల్లీ, జూన్ 2: యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. మే నెలలో రూ.25.14 లక్షల కోట్ల లావాదేవీలు జరిగినట్లు ఎన్‌పీసీఐ వెల్లడించింది. అంతక్రితం నెలలో జరిగిన రూ.23.94 లక్షల కోట్ల లావాదేవీలతో పోలిస్తే ఐదు శాతం అధికమయ్యాయని తెలిపింది. సంఖ్యాపరంగా చూస్తే 1,867.7 కోట్ల లావాదేవీలు జరిపారు. అలాగే ఏప్రిల్ నెలలో ఇది 1,789.3 కోట్ల లావాదేవీలు జరిగాయి. క్రితం ఏడాది ఇదే నెలలో జరిగిన రూ.20.44 లక్షల కోట్ల యూపీఐ లావాదేవీలతో పోలిస్తే మాత్రం 23 శాతం వార్షిక వృద్ధి నమోదైందని పేర్కొంది.

సత్తా చాటిన రిలయన్స్ ఇండస్ట్రీస్

టాప్-30 ప్రపంచ టెక్నాలజీ కంపెనీల జాబితాలో చోటు

న్యూఢిల్లీ, జూన్ 2: దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ మరోసారి సత్తాచాటింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బహిరంగంగా వర్తకం చేయబడిన టాప్-30 గ్లోబల్ టెక్నాలజీ కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చోటు దక్కింది. ఈ జాబితాలో భారత్ నుంచి చోటు దక్కించుకున్న తొలి సంస్థ రిలయన్సే కావడం విశేషం. 'ట్రెండ్స్-ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్' ఇది ఏఐ టెక్నాలజీతో వేగవంతమైన ప్రపంచ స్వీకరణ, పరివర్తన ప్రభావాన్ని అందుకోవడానికి దేశీయ, అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆధారంగా ఈ జాబితాలో అమెరికాకు చెందిన గ్లోబల్ టెక్నాలజీ సంస్థలైన మైక్రోసాఫ్ట్, ఎన్విడియా, యాపిల్, అమెజాన్, ఆల్ఫాబెట్, మెటా ప్లాట్‌ఫామ్, టెస్లా, బ్రోడ్‌కామ్ చోటు దక్కించుకున్నాయి. తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీకి తొమ్మిదో స్థానం లభించగా, చైనాకు చెందిన టెన్‌సెంట్ ఆ తర్వాతి స్థానం దక్కింది. 216 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో రిలయన్స్ 23వ స్థానం వరించింది. గడిచిన 30 ఏండ్లుగా (1995 నుంచి 2025) వరకు ఐదు కంపెనీలు మాత్రమే టాప్-30 అత్యంత విలువైన పబ్లిక్ ట్రేడెడ్ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీలైన- మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, సిస్కో, ఐబీఎం, ఏటీఅండ్‌టీలు చోటు దక్కించుకున్నాయని పేర్కొంది.

- ఈ జాబితాలో తొలిసారిగా చోటు దక్కించుకున్న సంస్థల్లో రిలయన్స్, ఎన్విడియా, యాపిల్, అమెజాన్, ఆల్ఫాబెట్, మెటా, టెస్లా, అలీబాబా, సేల్స్‌ఫోర్స్, చైనా మొబైల్‌లు ఉన్నాయి.
- 1995లో అమెరికాకు చెందిన 53 శాతం సంస్థలు(30లో 16) చోటు లభించగా, అదే 2025 నాటికి ఇది 70 శాతానికి(30లో 21 సంస్థలు) పెరిగాయి.
- 1995లో జపాన్ 30 శాతం(30లో తొమ్మిది సంస్థలు) టాప్ టెక్ కంపెనీలకు చోటు లభించగా, అదే 2025 నాటికి సున్నాకు పడిపోయాయి.
- బ్రిటన్, సింగపూర్, హాంకాంగ్, మెక్సికో, మలేషియాకు చెందిన సంస్థలు చోటు లభించగా..ప్రస్తుత జాబితాలో ఈ దేశాలకు చెందిన సంస్థలు లేవు.
- 2025కి గాను విడుదలైన జాబితాలో చైనాకు చెందిన 3 సంస్థలు ఉండగా, జర్మనీకి చెందిన 2, తైవాన్, నెదర్లాండ్స్, దక్షిణ కొరియా, భారత్‌కు చెందిన ఒక్కో సంస్థకు చోటు లభించింది.
- ప్రపంచంలో వినియోగిస్తున్న 80-90 శాతం చిప్‌ల తయారీ సంస్థయైన తైవాన్‌కు చెందిన ఒకేటీఎస్ఎంసీ చోటు దక్కింది.

ఉత్పత్తిపై ఎన్‌ఎండీసీ ఫోకస్

న్యూఢిల్లీ, జూన్ 2: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి సంస్థయైన ఎన్‌ఎండీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్నది. వచ్చే మార్చి నాటికి 55 మిలియన్ టన్నులు, ఇదే క్రమంలో 2030 నాటికి 100 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కంపెనీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ 45 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేసింది.

'ఇరాన్ కార్గో దిగలేదు'

న్యూఢిల్లీ, జూన్ 2: ఇరాన్ నుంచిగానీ లేదా ఆ దేశానికి చెందిన ఏ షిప్ నుంచైనాగానీ వచ్చిన సరకును తమ ఆధ్వర్యంలోని పోర్టుల్లో దించలేదని అదానీ గ్రూప్ సోమవారం స్పష్టం చేసింది. గుజరాత్‌లోని ముంద్రా పోర్టు ద్వారా భారత్‌లోకి ఆంక్షల్ని ఉల్లంఘిస్తూ ఇరాన్ ఎల్‌పీజీని అదానీ గ్రూప్ సంస్థలు దిగుమతి చేసుకున్నాయా? అన్నదానిపై అమెరికా ప్రాసిక్యూటర్లు దర్యాప్తు చేశారంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వచ్చిన వార్తలకు అదానీ పైవిధంగా స్పందించింది.